క్లుప్తంగా

హియరింగ్ ఎయిడ్ మెషీన్ల పంపిణీ



వృద్ధులకు హియరింగ్ ఎయిడ్ మెషీన్లు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: మెంటాడ మండలం మీసాలపేట గ్రామానికి చెందిన నలుగురు వృద్ధులు కొన్నేళ్లుగా వినికిడి సమస్యతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జెడ్పీ నిధులతో నాలుగు హియరింగ్ ఎయిడ్ మెషీన్లు కొనుగోలు చేసి బుధవారం పంపిణీ చేశారు. జెడ్పీ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్టిస్తున్న అర్చకులు, కమిటీ ప్రతినిధులు, భక్తులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కేఎల్ పురంలో ఉన్న రాధాకృష్ణ మందిరంలో ధ్వజస్తంభాన్ని బుధవారం పునఃప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గంటి పార్థసారథి, కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదన్నారు. అనంతరం రూ. 3 లక్షల రూపాయలు అందించిన దాత శోభన చలపతిరావు, విజయభారతి దంపతులను సత్కరించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో సుమారు ఐదువేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి రమణమూర్తి, కార్యదర్శులు చిన్నికృష్ణ, గంగరాజు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమామోహిని, సిబ్బంది

నెల్లిమర్ల: జ్యోతి బాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇన్‌స్పైర్ మానక్ అవార్డులు గెలుపొందారు. 9వ తరగతి చదువుతున్న సింగారపు భవ్యశ్రీ, కసిరెడ్డి జ్యోతిక ఇటీవల నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచడంతో అవార్డులు వరించాయి. దోమలను చంపే అధునాతన యంత్రం రూపొందించినందుకు భవ్యశ్రీకి.. ఆటోమేటిక్ ఫిష్ ఫీడర్ సిస్టమ్ రూపకల్పనకు జ్యోతికకు అవార్డులు వచ్చాయి. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని, సైన్స్ ఉపాధ్యాయులు జి. జ్యోత్స్న, కేవైపీ లక్ష్మి, సీహెచ్ సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.


రామనారాయణంలో ఘనంగా అక్షరాభ్యాసం



జ్ఞాన సరస్వతీ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో జ్ఞాన సరస్వతీదేవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని (వసంత పంచమి) సందర్భంగా బుధవారం సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీణాపాణి జ్ఞాన సరస్వతీదేవికి విశేష పూజలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

160 మందికి వైద్య పరీక్షలు



ఆరోగ్య కిట్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని గాంధీనగర్ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దక్షయ రామ్‌నాయుడు, ఎల్.వినోద్, ఎస్. మౌనిక వందన, టి.రమణమ్మ, ఇతర సిబ్బంది 160 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, బోర్డు డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

అందంగా.. మరింత సుందరంగా...

- అభివృద్ధిపథంలో విజయనగరం
- ఇప్పటికే పలు కూడళ్లు అభివృద్ధి
- నగరంలో మరో సుందర కూడలిగా ఎస్‌బీఐ జంక్షన్
- రూ.50 లక్షల కార్పొరేషన్ నిధులతో సుందరీకరణ పనులు
- మహాత్మాగాంధీ విగ్రహంతో పాటు వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు
- ఈ నెల 20న మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం



ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ జంక్షన్ వద్ద గల పెద్ద చెరువు గట్టుపై ఏర్పాటు చేస్తున్న మహాత్మా గాంధీ విగ్రహం

విజయనగరం: గత టీడీపీ పాలకులు విజయనగరానికి దక్కిన కార్పొరేషన్ హోదాను తమ పదవుల కోసం ఐదేళ్లు తాకట్టు పెడితే.... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గడిచిన నాలుగున్నరేళ్లలో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తున్నారు. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, సుందరీకరణ పనులే ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఇప్పటికే నగరంలోని ప్రధానమైన మయూరి జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్, బాలాజీ జంక్షన్, ఎత్తుబ్రిడ్జి జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, దాసన్నపేట రైతుబజార్ జంక్షన్, కొత్తపేట నీళ్లట్యాంక్ జంక్షన్లను సుందరీకరణ చేపట్టగా.. నగర ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారికి ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయనడంలో సందేహం లేదు. తాజాగా నగరం నడిబొడ్డున గల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ జంక్షన్ ఈ జాబితాలో చేరనుంది. రూ.50 లక్షల కార్పొరేషన్ నిధులతో జంక్షన్ వద్ద పెద్ద చెరువు గట్టును సుందరంగా తీర్చిదిద్ది, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహం చుట్టూ అందమైన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు ఆ ప్రాంగణంలో ఆహ్లాదాన్ని పంచేలా వాటర్ ఫౌంటైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనలతో చేపడుతున్న అభివృద్ధి పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఈనెల 20న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: మేయర్ విజయలక్ష్మి

నూతన ఏర్పాటు చేస్తున్న మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఈ నెల 20న ప్రారంభించనున్నట్లు మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. ఈ మేరకు విగ్రహ ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాంధీ విగ్రహం చుట్టూ ఆహ్లాదకర వాతావరణం కలిగించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహానుభావుడు మహాత్మా గాంధీ అని, అటువంటి మహోన్నత వ్యక్తి విగ్రహం నగరంలో ఏర్పాటు చేసుకోవడం మనందరి అదృష్టమన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ.. నగరంలో ఎక్కడా లేని విధంగా మహాత్మా గాంధీ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే వివిధ ప్రాంతాలలో అల్లూరి సీతారామరాజు, వీరబ్రహ్మేంద్రస్వామి, శివాజీ మహారాజ్, అంబేడ్కర్, కోడి రామ్మూర్తి వంటి అనేక మంది మహానుభావుల విగ్రహాలను నెలకొల్పి ఆయా జంక్షన్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, సీనియర్ కార్పొరేటర్లు కేదారిశెట్టి సీతారామమూర్తి, కంటుభుక్త తవిటిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిల్లా క్రాంతికుమార్, యడ్ల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్లు

క్రీస్తు సేవలో తరించాలి



దైవసందేశం అందజేస్తున్న విశాఖ క్రైస్ట్ చర్చ్ మినిస్ట్రీస్ దైవ వర్తమానికులు రెవరెండ్ ఆంథోనీరాజ్

విజయనగరం టౌన్: ఏసుక్రీస్తును ప్రతిఒక్కరూ ఆరాధించాలని విశాఖ క్రైస్ట్ చర్చి మినిస్ట్రీస్ దైవ వర్తమానికుడు రెవరెండ్ జె. ఆంథోనీరాజ్ సూచించారు. బుధవారం రాత్రి స్థానిక అంబటిసత్రం వద్ద నున్న ఏసు ప్రేమాలయంలో ఏసుక్రీస్తు శిలువ శ్రమలు మరణ పునరుత్థానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా టీమ్, సెరాయా టీమ్, యూత్‌ఫర్ జీసెస్, జోసఫ్ టీమ్, జీసెస్ ట్రంపెట్స్ ఆలపించిన క్రీస్తుగీతాలాపనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఏసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్, సువర్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఉపవాస దీక్షల కార్యక్రమంలో కోరాడ నాగేశ్వరరావు, విక్టర్ బాబు, జాన్, శ్రీనివాస్, సూర్యనారాయణ, సుజన్, అధిక సంఖ్యలో క్రీస్తు ఆరాధకులు పాల్గొన్నారు.

నేడు కుళాయిల ప్రారంభం

పూసపాటిరేగ: మండలంలోని అల్లాడపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన జల్‌జీవన్ కుళాయిలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కనిమెల్లలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వివాహిత అదృశ్యం

భోగాపురం: మండలంలోని అమటాం రావివలస గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజపతినగరం మండలం ఎరుకులపేట పాతబుగ్గం గ్రామానికి చెందిన పాలవలస గణేష్ తన భార్య ఈశ్వరమ్మతో కలిసి మండలంలోని అమటాం రావివలసలో నివసిస్తున్నాడు. ఈనెల 12న విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురంలో నివాసముంటున్న తన తోడల్లుడు కుమార్తె పుట్టినరోజుకు గణేష్ వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య ఇంట్లో లేకపోవడంతో బంధువుల సహాయంతో చుట్టుపక్కల ప్రాంతాలు వెతికాడు. ఫలితం లేకపోవడంతో బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాఠశాలల సందర్శన

వేపాడ: మండలంలోని బానాది ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్కరరావు బుధవారం సందర్శించారు. ముందుగా పాఠశాల పరిసరాలు, తరగతిగదులు, విద్యార్థుల వర్క్ బుక్స్, టీచర్ల లెసన్ ప్లాన్‌ను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపా ధ్యాయులకు సూచించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

భోగాపురం: రాష్ట్రంలోని 15 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లు, జీపీఎఫ్, ఏపీజీఎల్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఐఆర్ వెంటనే ప్రకటించడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ డీఏలు, ఏరియర్స్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ భోగాపురం తాలుకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు, జాయింట్ కార్యదర్శి ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ శేఖర్, మహిళా కార్యదర్శి కృష్ణవేణి, రమణ, సత్యనారాయణ, అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

- ఆలయాల నిర్మాణాలకు శంకుస్థాపన
- పూర్తయిన దేవాలయాల ప్రారంభోత్సవం



కొత్తవలస: సుందరయ్యపేటలో బంగారమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: మండలంలోని సుందరయ్యపేటలో ఎంపీటీసీ లెంక వరహాలు ఆధ్వర్యంలో గ్రామదేవత బంగారమ్మతల్లి ఆలయ ప్రతిష్టోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ ప్రతిష్ట

గుర్ల: మండలంలోని గోవుపేటలో షిర్డీ సాయి బాబా ఆలయ ప్రతిష్టోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విఘ్నేశ్వరుడు, అంభయాంజనేయస్వామి, సాయిబాబా విగ్రహాలను ప్రతిష్టించారు. ఈసందర్భంగా హోమాలు,ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు పూజల్లో పాల్గొన్నారు.

విజయరాంపురంలో..

దత్తిరాజేరు: మండలంలోని విజయరాంపురంలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్టాపన బుధవారం నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేకపూజలు చేసి ఆలయంలో స్వామి వారి విగ్రహాన్ని, గోపురంపై పూర్ణకలశాన్ని ప్రతిష్టించారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.



కొత్తవలస: గొల్లపేటలో రాధాకృష్ణ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు,వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు



దత్తిరాజేరు: దత్తిలో ఆదివరాహస్వామి ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న తిరుపతినాయుడు దంపతులు

రాధాకృష్ణ దేవాలయానికి శంకుస్థాపన

కొత్తవలస: మండల కేంద్రంలోని గొల్లపేటలో రాధాకృష్ణ దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు,రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, పలువురు సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.



గుర్ల: గోవుపేట షిర్డీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు



దత్తిరాజేరు: విజయరాంపురంలో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్టోత్సవంలో భక్తులు

వరాహస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

దత్తిరాజేరు: మండలంలోని దత్తి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆది వరాహస్వామి ఆలయ నిర్మాణానికి ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు దంపతులు బుధవారం శంకుస్థా పన చేశారు. అర్చకులు మండాడి హరికృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజలందరిపై పైడితల్లి ఆశీస్సులు



పైడితల్లి అమ్మవారి ఆలయ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: పైడితల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పోలిపల్లిలో రూ . 40 లక్షల దేవదాయ శాఖ నిధులతో పునర్నిర్మించిన పైడితల్లి ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మల్లికార్జునశర్మ (మల్లిబాబు), పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో ఎమ్మెల్యే అప్పలనాయుడు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాష్, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ఈఓ వై. శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ కర్రోతు పైడిరాజు, పతివాడ రామకృష్ణ, కర్రోతు బంగారాజు, పిన్నింటి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



బోరును ప్రారంభిస్తున్న ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రెడ్డికంచేరు, గాబువానిపాలెం గ్రామాల్లో రూ.13.50 లక్షల ఎంపీపీ నిధులు, రూ.3 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అలాగే గాబువానిపాలెం శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి రమణ, వైస్ సర్పంచ్ అప్పన్న, సచివాలయ కన్వీనర్ శీరపు గురునాథ్‌రెడ్డి, దల్లి బంగారురెడ్డి, వంశీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు శంకుస్థాపన



తంగుడుబిల్లిలో ఆలయ నిర్మాణాలకు శంకుస్థాపన పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లిలో గ్రామ దేవతల ఆలయ నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలోని రాజమ్మ, పైడిమాంబ, ముత్యాలమ్మ, భూలోకమ్మ అమ్మవారి ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు శ్రీపంచమి సందర్భంగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో శంకుస్థాపన పూజలు నిర్వహించారు. టీటీడీతో పాటు దాతల సహకారంతో ఆలయ పునఃనిర్మాణ పనులు చేపడతామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నింటి చిన అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు వాల్లే నాగేశ్వరరావు, రెడ్డి సూర్యనారాయణ, పాలూరి తిరుపతిరావు, లెంక నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

నెల్లిమర్ల: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో పలువురు పెన్షనర్లు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల తాలూకా యూనిట్‌కు చెందిన సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, గతేడాది జులై నుంచి పీఆర్‌సీ అమలు చేయాలని.. 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని.. పెండింగ్ పీఎఫ్, బీమా బకాయిలు కట్టాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పెరగకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ధర్మరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ నెల్లిమర్ల తాలూకా యూనిట్ జనరల్ సెక్రటరీ యర్ర రమణ, జాయింట్ సెక్రటరీ పీసీ నవీన్, పి.శంకరరావు, కోశాధికారి కె. ధనుంజయ్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

గంట్యాడ: రైతు సంక్షేమం, వారి అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని వసం త గ్రామంలో రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) నూతన భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఆర్బీకేలు ఏర్పాటు చేసి రైతుల చెంతకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందిస్తున్నారని చెప్పారు. రైతుల నుంచి ధాన్యాన్ని కూడా ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందన్నారు. ఏటా రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పేరిట రూ.13,500 ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ప్రకృతి విపత్తుల వల్ల పంటలకు నష్టం జరిగితే వెనువెంటనే పరిహారం అందిస్తూ సీఎం జగన్ రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. రైతులకు అన్ని విధలా వెన్నుదన్నుగా ఈ ప్రభుత్వం నిలిచిందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా 550కు పైగా రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నామని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న సీఎం జగన్‌ని మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ శిరికి అచ్చియ్యమ్మ, ఎంపీటీసీ చొక్కాకుల చంద్రకళ, వైఎస్సార్‌సీపీ నాయకులు లచ్చిరెడ్డి కృష్ణ, కిలపర్తి అప్పలనాయుడు, పి. నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.